# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు స్థూల రాష్ట్ర ఉత్పత్తి –జీఎస్‌డీపీపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు – దిగమర్రు రహదారికి కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు.**
3. **గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార బ్యాంకులు దోహదపడతాయని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**
4. **రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జి.తుహిన్ కుమార్ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు.**
5. **గ్రామాల్లోనూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ అన్నారు.**

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో స్థూల రాష్ట్ర ఉత్పత్తి –జీఎస్‌డీపీపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధికై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం ఎక్సైజ్ విధానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

-------------------------

పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు – దిగమర్రు నాలుగు లైన్ల రహదారికి కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడారు. భీమవరం పట్టణానికి ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు నాలుగు పై వంతెనలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి పేర్కొంటూ....

వాయిస్..25 సెకన్లు

-------------------------

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార బ్యాంకులు దోహదపడతాయని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు-ఆప్కాబ్ 62వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సహకార సంఘాల సభ్యులకు, అధికారులకు మంత్రి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడుల కోసం సకాలంలో రుణాలు అందిస్తూ, వ్యవసాయ అభివృద్ధికి సహకారం అందిస్తోందని తెలిపారు. సహకార వ్యవస్థను మరింత శక్తివంతం చేసి, రైతులకు ఆర్థిక సాధికారత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం స్వర్ణాంధ్రప్రదేశ్ 2047ను రూపొందించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని మంత్రి పార్థసారథి కుటుంబ సమేతంగా ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ ..32 సెకన్లు

మరోవైపు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ వేర్వేరుగా స్వామివారిని ఈ రోజు దర్శించుకున్నారు.

---------------------------

రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారుల స్థానంలో కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లాలోని కంభం, బెస్తవారిపేట మండలాల్లో కోటీ 37 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన రోడ్ల పనులకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. నూతనంగా నిర్మించే రహదారులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జి.తుహిన్ కుమార్ ఈ రోజు ప్రమాణస్వీకారం చేశారు. అమరావతిలోని హైకోర్టు సమావేశపు హాలులో ఆయనతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ప్రమాణస్వీకారం చేయించారు. తుహిన్ కుమార్ ప్రమాణస్వీకారంతో రాష్ట్ర హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. రెండు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

---------------------------

ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు. సారథ్యం - జిల్లాల పర్యటనలో భాగంగా పల్నాడు జిల్లాలో పర్యటిసున్న ఆయన నరసరావుపేటలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద స్థానికులతో నిర్వహించిన 'చాయ్ పే చర్చా' కార్యక్రమంలో ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, పల్నాడు జిల్లాలో పెద్ద వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయని వాటిని సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనా విధానాన్ని ప్రజలలోకి తీసుకెళ్తున్నామని ఆయన తెలుపుతూ,

వాయిస్ ..27 సెకన్లు

---------------------------

గ్రామాల్లోనూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం అలత్తూరు గ్రామపంచాయతీలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విలేజ్ క్లినిక్‌ల ద్వారా వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

తమిళనాడులో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ముగ్గురు మృతి చెందారు. వైద్య చికిత్స కోసం చెన్నైకి కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని, ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తుండగా ప్రమాదం జరగడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

---------------------------

అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వాణిజ్య సహకారంలో అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి, వాణిజ్యం ప్రాముఖ్యతను తెలియజేసేలా ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి సోమవారాన్ని వాణిజ్య దినోత్సవంగా జరుపుకుంటారు. ఐస్లాండ్ రాజధాని రేక్జావిక్‌లోని వాణిజ్య దుకాణాల సంఘాల నిర్వాహకులు తొలిసారిగా 1894లో ఈ రోజును నిర్వహించారు. అంతర్జాతీయ వాణిజ్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం, ప్రపంచీకరణ ఆర్థిక అభివృద్ధిలో వాణిజ్యం పాత్రను గుర్తించడం, దేశాల మధ్య మరింత సహకారాన్ని ప్రోత్సహించడమే అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 410 పాయింట్ల లాభంతో 81 వేల వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 149 పాయింట్ల లాభంతో 24 వేల 714 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

ఉత్తర తమిళనాడులో నైరుతి దిశగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి. శేఖర్ తెలియజేస్తూ....

వాయిస్...15 సెకన్లు

=====================